# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 185 | శుక్రవారం, 05 జూన్ 2026 | పేజీలు : 4




## ధాన్యాన్ని త్వరితగతిన

# తరలించాలి

### జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన గోదాములు, మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు.

- మన చౌరాస్తా, జనగామ

2 లో

# హరీశ్‌రావుకు శుభాకాంక్షలు



**హైదరాబాద్, మన చౌరాస్తా :** మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు తన్నీరు హరీశ్ రావు జన్మదినోత్సవం సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.




విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయిస్తే

# జైలుకే..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

3 లో



చెత్త బండ్లు అందుబాటులో

# ఉంచాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




# ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలి

- రవాణా ప్రక్రియలో వేగం పెంచాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ, మన చౌరాస్తా :** కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన గోదాములు, మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు, రవాణా ప్రక్రియ చివరి దశలో ఉన్నందున, అధికారులు పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం ద్వారా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం త్వరగా మిల్లులకు చేరుతుందన్నారు. ఇప్పటివరకు 30,164 రైతుల వద్ద నుంచి 1,91,775.700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 1,83,606.080 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించడం జరిగిందని, అలాగే 29,317 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 348.99 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 1,51,739 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే మిల్లులు, కొనుగోలు కేంద్రాల వారీగా కొనుగోళ్ల వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అని కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ఎక్కువ ధాన్యం ఉన్న కేంద్రాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించి, అదనపు వాహనాలను కేటాయించి, త్వరగా ధాన్యం బస్తాలను లోడింగ్ చేయించి, మిల్లులకు తరలించాలన్నారు. రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలు, ట్రాక్టర్లను వెనువెంటనే దిగుమతి చేసి, తిరిగి కొనుగోలు కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వెల్దండ, వడ్లకొండ, అశ్వారావుపల్లి, రామన్నగూడెం, ఏడునూతుల, పాకాల, చిల్పూర్, నష్కల్, రాజవరం గ్రామాల్లో గల కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను, ట్రాక్టర్ లను పంపించి, లోడింగ్ వేగవంతం చేయాలన్నారు. గన్ని సంచులను సరిపడా అందుబాటులో ఉంచాలని, జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో భాస్కర్, డీఎంఓ రామకృష్ణ, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, డీసీఓ కరుణ, రవాణా శాఖ అధికారి శిల్ప, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలోని బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి గ్రామ పరిధిలో గల పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, గ్రౌండింగ్, స్లాబ్, రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు. బేస్‌మెంట్ పనుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రూఫ్ స్థాయి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్లాస్టరింగ్, వైట్ వాష్ పనులు, అలాగే రెండు పడక గదుల పరిశీలనలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, డిఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాణాపురంలో మహా సుదర్శన యాగం



- జూలై 18 నుంచి 23 వరకు మహోత్సవాలు
- హాజరుకానున్న చిన్న జీయర్ స్వామి



**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తృతీయ పుష్కర వేడుకల సందర్భంగా జూలై 18 నుంచి 23 వరకు మహా సుదర్శన యాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధాన అర్చకులు, యాదాద్రి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో సర్వారిష్ట శాంతి, గ్రహనక్షత్ర అనుకూలత కోసం మహా సుదర్శన యాగం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. జూలై 18 సాయంత్రం శ్రీ విష్వక్సేనారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 19న సంతానప్రాప్తి, వివాహం, ఆరోగ్యం కోసం శ్రీ వైనతేయ ఇష్టి, మంత్రోపదేశాలు, సమాశ్రయణాలు నిర్వహిస్తారు. 20న వృద్ధ దంపతుల ఆరాధన, సాయంత్రం కవి సమ్మేళనం, కవిపండిత సత్కారం జరుగుతుంది. 21న శ్రీ సుదర్శనేష్టి, శ్రీ సుదర్శన పెరుమాళ్ల ఆరాధన, సాయంత్రం భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తారు. 23న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆరాధన, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, ఉత్సవ సమావర్తనం, రుత్విక్ సన్మానం, యజమానులకు ఆశీర్వచనాలతో మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.




# బెల్ట్ షాపులపై సర్పంచ్ సోదాలు

- లిక్కర్ బాటిళ్లు స్వాధీనం
- భీమదేవరపల్లిలో మద్యపాన నిషేధంపై చర్యలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భీమదేవరపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామపంచాయతీ చర్యలు ముమ్మరం చేసింది. గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం బెల్ట్ షాపులను తనిఖీ చేసి, విక్రయానికి ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు గురవడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు అక్రమ మద్యం విక్రయాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్ట్ షాపులను సహించబోమని స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులకు సమాచారం అందజేస్తామని హెచ్చరించారు. గ్రామాన్ని మద్యం రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు ప్రేమలత, లలిత, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామపంచాయతీ చర్యలను పలువురు గ్రామస్తులు స్వాగతించారు.

# కొత్తకొండ దేవస్థానం భూముల కౌలు వేలం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్ర స్వామి దేవస్థానానికి చెందిన భూముల కౌలు వేలం పాటలను గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలకు భక్తులు, రైతులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. వేలంలో సర్వే నంబర్ 95 భూమిని గుర్రాల స్వప్న రూ.8 వేలకు, సర్వే నంబర్లు 28, 29 భూములను ముప్పు వెంకటయ్య రూ.37,500కు కౌలుకు దక్కించుకున్నారు. సర్వే నంబర్ 97 భూమిని మంగ రవీందర్ రూ.9 వేలుకు, సర్వే నంబర్ 40 భూమిని కొత్తపల్లి రవీందర్ రూ.3,600కు కౌలుకు పొందారు. వేలం పాటలను పర్యవేక్షణ అధికారి నందనం కవిత పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, గ్రామ సర్పంచ్, దేవస్థానం పాలకవర్గ సభ్యులు, చంటయ్యపల్లి ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం ఆదాయ వృద్ధి, ఆలయ అభివృద్ధి లక్ష్యంగా కౌలు వేలం పాటలు నిర్వహించినట్లు కార్యనిర్వాహణ అధికారి పి. కిషన్‌రావు తెలిపారు. వేలం ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పారు.

# గుడి గంటలు మాయం చేసిన దొంగలు

- ముల్కనూర్ మల్లన్న ఆలయంలో చోరీ



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని మల్లన్న ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయానికి చెందిన సుమారు రూ.70 వేల విలువైన మూడు ఇత్తడి గుడి గంటలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. గురువారం ఉదయం ఆలయ నిర్వాహకులు గంటలు కనిపించకపోవడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు రికార్డైనట్లు నిర్వాహకులు తెలిపారు. దుండగులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇటీవల గ్రామ పరిసరాల్లో చోరీలు పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బక్రీద్ పండుగకు ముందు ఆలయ సమీపంలో నివసించే రైతు చెక్కుల కొండయ్యకు చెందిన మూడు మేకలు, రెండు గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన కూడా చోటుచేసుకుందని తెలిపారు. గ్రామంలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచి, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయ ఆస్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# చెత్త వెహికల్స్ అందుబాటులో ఉంచాలి

■ **హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**హనుమకొండ, మన చౌరాస్తా :** పారిశుద్ధ్య సేవలకు ఉపయోగించే వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకుండా, మరమ్మతులు వేగంగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో వాహనాల నిర్వహణ, మరమ్మతులు, చెత్త సేకరణ, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాహనాల మరమ్మతులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పూర్తి చేయాలని, చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు వెళ్లినప్పుడు ప్రత్యామ్నాయ వాహనాలను ఏర్పాటు చేసి సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న 100 టన్నుల సామర్థ్యం గల తడి చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తడి చెత్త సేకరణను విస్తరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని వార్డుల్లో చెత్త సేకరణ వాహనాలు నిర్దేశిత మార్గాల్లో పూర్తిస్థాయిలో తిరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వాహనంలో తడి చెత్త, పొడి చెత్త, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్-2026 లక్ష్యాల సాధనలో భాగంగా వ్యర్థాల వర్గీకరణపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

**పూడికతీత పూర్తిచేయండి..**

వర్షాకాలానికి ముందే మురుగు కాలువల పూడికతీత పనులను పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను వినియోగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య వాహనాలకు ఇంధన సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించే మలినాలను ఎక్కడా అక్రమంగా డంపింగ్ చేయకుండా ఎఫ్ఎస్‌టీపీకి మాత్రమే తరలించేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి, ఎంహెచ్ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయిస్తే జైలుకే..

■ **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్, మన చౌరాస్తా :** పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' పేరుతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, ఇతర దుకాణాల్లో గుట్కా, సిగరెట్లు వంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా స్కూళ్లు, కాలేజీల పరిసరాలను టొబాకో ఫ్రీ జోన్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యాసంస్థల సమీపంలో పొగాకు విక్రయాలు నిషేధమని తెలియజేసే గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే సిగరెట్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్-2003 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జువైనల్ జస్టిస్ యాక్ట్-2015 సెక్షన్ 77 కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఏఎస్సై రాజేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ లక్ష్మీపతికి ఝాన్సీరెడ్డి పరామర్శ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన సాక్షి పాత్రికేయులు నల్ల లక్ష్మీపతి గత పదిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం అందరికీ తెలిసిందే. ఓ ప్రయివేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని హాస్పిటల్ కు టీపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి వెళ్ళి లక్ష్మీపతిని పరామర్శించారు. యాక్సిడెంట్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వ్యక్తి గతంగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకోచ్చే పాత్రికేయులు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని, అలాంటి వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రమాదం నుండి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.






## బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

■ **పోతు చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు**

**వరంగల్, మన చౌరాస్తా:** వరంగల్ 14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్‌లో ప్రముఖ వ్యాపారవేత్త పోతు చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, వ్యాపార ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై చంద్రశేఖర్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సేవా కార్యక్రమం చేపట్టారు. బీసీ బహుజన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అడుప మహేష్, సౌరం అభిలాష్ ఆధ్వర్యంలో జంక్షన్ వద్ద బాటసారులు, స్థానికులకు సుమారు 300 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతు చంద్రశేఖర్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకుని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అడుప మహేష్, సౌరం అభిలాష్‌లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌరం సుభాష్, పులిచేరి రాధాకృష్ణ, కాశెట్టి కమలాకర్, ఏకబ్రాచారి, కొలిపాక సత్యం, రాజు, కుమార్, ప్రతాప్, ప్రమోద్, జీవన్, యాకుబ్, రాకేష్, సాయి తదితరులతో పాటు చంద్రశేఖర్ స్నేహితులు పాల్గొన్నారు.



## కరాటేతో ఆత్మరక్షణ

■ **రంగు మల్లికార్జున్ గౌడ్**

**జనగామ, మన చౌరాస్తా:** హైదరాబాద్‌లోని హేమనగర్‌లో గురువారం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో జనగామకు చెందిన విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ బెల్ట్ గ్రేడింగ్‌లు సాధించారని కరాటే మాస్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ ఇండియా చీఫ్ రంగు మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ కరాటే కేవలం క్రీడ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణను పెంపొందించే ఉత్తమ మార్షల్ ఆర్ట్ అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కరాటే శిక్షణ ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మరక్షణ కోసం కరాటేను అభ్యసించాలని, లక్ష్యసాధన కోసం నిరంతరం సాధన చేయాలని సూచించారు. విద్యార్థుల కృషి, క్రమశిక్షణ ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కరాటే మాస్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కొయ్యడ ప్రసాద్, ఇన్‌స్ట్రక్టర్లు అక్షిత్ మణివర్ధన్, మనస్విన్, జెస్సిక, సామ్యేల్ జాన్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## డైరీ యూనిట్ల పైలట్ ప్రాజెక్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టు కింద డైరీ యూనిట్ల ఏర్పాటు కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డైరీ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలనుకునే అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి ఈ నెల 11వ తేదీలోగా సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గడువు తర్వాత అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతల కోసం మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అర్హులైన బీసీ వర్గాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# ప్రీమియర్లతోనే పెద్ది ఊచకోత..

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' గురువారం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చింది. ఉదయం ఆట నుంచే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి నెక్స్ట్ లెవెల్ రెస్పాన్స్ వస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన ఖాతంలో మరో బ్లాక్ బస్టర్ హిట్ వేసుకున్నాడు. తాజాగా విడుదలైన పెద్ది సినిమా బ్లాక్ బాస్టర్ టాక్ తో దూసుకుపోతుంది. గేమ్ ఛేంజర్ లాంటి డిజాస్టర్ సినిమాతర్వాత వచ్చిన పెద్ది సినిమాపై అభిమానులు బారి అంచనాలు పెట్టుకున్నారు. ఆ అంచనాలను పెద్ది అందుకుంది. బుచ్చిబాబు సన దర్శకత్వలో తెరకెక్కిన పెద్ది సినిమా మంచి విజయాన్ని అందుకుంది. జూన్ 3న పెద్ది సినిమా ప్రీమియర్స్ పడ్డాయి. ప్రీమియర్ షోలతోనే బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. కాగా పెద్ది సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకోవడంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఇక పెద్ది సినిమా ప్రీమియర్స్ తోనే రికార్డ్ క్రియేట్ చేసింది. జూన్ 3న ఇండియావైడ్ గా జరిగిన ప్రీమియర్ల ద్వారా 'పెద్ది ' రూ.21 కోట్ల గ్రాస్‌ను సొంతం చేసుకుంది. తద్వారా,రూ.25 కోట్లకు పైగా వసూలు చేసిన 'OG' తర్వాత టాలీవుడ్‌లో పెద్ది రెండవ అతిపెద్ద ప్రీమియర్ ఓపెనింగ్‌గా నిలిచింది. ఏపీలో రూ. 10కోట్లకు పైగా గ్రాస్ రాబట్టిందని తెలుస్తుంది. అలాగే తెలంగాణాలో రూ 6కోట్లు, కర్ణాటక రూ. 3 కోట్లు మొత్తంగా ఇండియా వైడ్ గా రూ. 21 కోట్లు రాబట్టిందని తెలుస్తుంది. అలాగే వరల్డ్ వైడ్ గా రూ. 38కోట్లు రాబట్టిందని టాక్ వినిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చిన పెద్దికి ఉదయం ఆట నుంచే ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా మాస్ ఆడియన్స్ నుంచి నెక్స్ట్ లెవెల్ రెస్పాన్స్ వస్తోంది. థియేటర్ల బయట పాలాభిషేకాలు, డప్పు చప్పుళ్లతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటుండగా.. సినిమా చూసి బయటకు వచ్చిన ప్రేక్షకులు తమ అభిప్రాయాలను ఉత్సాహంగా పంచుకుంటున్నారు. ఈ సినిమాలో చరణ్ కు జోడీగా జాన్వికపూర్ నటించింది. అలాగే శివరాజ్ కుమార్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించారు. ఏఆర్ రెహమాన్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకే హైలైట్ అంటున్నారు ఆడియన్స్.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**